క్లుప్తంగా

అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్ నమోదు



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి ఆధార్ నమోదు ప్రారంభించామని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మాడుగుల 1, 2, 3, సచివాలయ పరిధిలో గల 0 నుండి 5 ఏళ్లలోపు చిన్నారులకు ఈ నెల 19 వ తేదీ వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే మిగిలిన గ్రామాల్లో ఈ నెల 26 వ తేదీ నుంచి 28 వ తేదీ వరకు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో చికిత్సలు చేయించుకుంటున్న రోగులు

రోలుగుంట: స్థానిక జీవకారుణ్య సంఘం భవన్‌లో మంగళవారం నర్సీపట్నం వరుణ్ హెల్త్ సెంటర్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన సుమారు 180 మంది రోగులకు వైద్యులు బోళెం నవీన్ సాయి, చందు సాధారణ రోగ చికిత్సలు, ఆశిస్ గుండె సంబంధ రోగ పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జీవకారుణ్య సభ్యులు శిబిర నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రోలుగుంట: మండలంలోని కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలెం సరిహద్దులో పేకాడుతున్న వారిపై మంగళవారం స్థానిక ఎస్ఐ పి.వెంకట్రావు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దాడి సమయంలో పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 18,200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

లోపూడిలో మంచినీటి బోరు ఏర్పాటు



లోపూడిలో బోరు పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దొరాంబాబు

బుచ్చెయ్యపేట: మండలంలో లోపూడి గ్రామంలో నూతనంగా మంచినీటి బోరును స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మంగళ వారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పణతల వారి కళ్లాల వద్ద ఈ బోరును జిల్లా పరిషత్ నిధుల నుంచి మంజూరు చేశారు. తాగునీటి సమస్య వున్న చోట మంచినీటి బోర్లకు తన జెడ్పీటీసీ నిధులు మంజూరు చేస్తున్నామని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చప్పా చిట్టిబాబు, విజయరామరాజుపేట, కొండెంపూడి, గ్రామ సర్పంచ్‌లు యల్లపు విజయకుమార్, ఆది సత్తిబాబుతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు జి.ఆనంద్, పి.శ్రీను, జనసేన నాయకులు సురేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గొలుగొండ: రికార్డులు లేకుండా రోడ్డుపై వాహనాలు నడపరాదని నర్సీపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.ఆర్ మూర్తి తెలిపారు. ఆయన కృష్ణదేవిపేట-నర్సీపట్నం మార్గంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేని వాహనదారుల నుంచి అపరాధ రుసుం చెల్లించుకోవడం జరిగింది. మితిమీరిన వేగం, రికార్డులు లేకుండా వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

దేవరాపల్లి : తామరబ్బ పంచాయతీ పరిధిలోని గిరిజనులకు అనకాపల్లి జిల్లా సత్య సాయి సేవా సంస్థల సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. తామరబ్బలో స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ సమక్షంలో మంగళవారం అందజేశారు. పంచాయతీ పరిధిలోని సుమారు 50 మందికి దుప్పట్లను వితరణ చేశారు. గ్రామస్తుల తరఫున సర్పంచ్ రామకృష్ణ సత్య సాయి సేవా సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సత్య సాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వెంటాడుతున్న భూతాలు

- ఏపీపురం భూములపై బడాబాబుల కన్ను
- ఆన్‌లైన్‌లో రైతుల సాగు హక్కులు మాయం!

- దళారుల ప్రమేయంపై ఆరోపణలు
- రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసిన రైతులు
- ఏళ్ల తరబడి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులు



రైతులు సాగు చేసుకుంటున్న భూములు

నాతవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆన్‌లైన్‌లో సాగు హక్కు తొలగించడంపై రైతులు ఆందోళనలు చేస్తున్నారు. మండలంలో ఏపీపురం పంచాయతీలో సుమారుగా 290 ఎకరాల్లో 150 మంది రైతులు పూర్వం నుంచి సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిలో కొంత మందికి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉండగా, మరికొంత మందికి లేవు. రెవెన్యూ రికార్డుల్లో సాగు హక్కు కోలంలో మాత్రమే వీరు పేర్లు ఉంటాయి. గతంలో ఇక్కడ పని చేసిన రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూమిలో సాగు చేసే రైతుల పేర్లు మాత్రమే సాగు హక్కులో నమోదు చేసేవారు. ఇటీవల కూటమి



ఇటీవల రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సాగు రైతులు

ప్రభుత్వం రాకతో కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారులు సాగులో ఉన్న రైతుల పేర్లు లేకుండా చేసేశారు. పూర్వం నుంచి సాగు హక్కు కోలంలో ఉండే పేర్లు తొలగింపుపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈనెల 12వ తేదీన ఏపీపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రాజకీయాలకు అతీతంగా రైతులు దీనిని ప్రధాన సమస్యగా తహసీల్దార్ వేణుగోపాల్ దృష్టికి తీసుకువచ్చారు.

భూమి పూర్వాపరాలు

ఏపీ పురం పంచాయతీలో వందేళ్ల క్రితం సుమారుగా



సాగు హక్కు తొలగింపుపై రైతుల ఆందోళన

800 ఎకరాల్లో రైతులు తుప్పలు డొంకలు తొలగించి పోడు వ్యవసాయం చేసుకునేవారు. ఈ భూమిలో కొంతమంది బ్రాహ్మణుల పేరిట భూములు ఉండేవి. ఆ బ్రహ్మణులకు వారసులు లేకపోవడంతో వారికి సేవలు చేసే రైతులకు 50 ఏళ్ల క్రితం ఈ భూములు ఇచ్చేసారు. పూర్వం నుంచి సాగు చేసే రైతులు మరణించడంతో వారి కుటుంబ సభ్యులు ఈ భూమిలో నేటికీ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అక్షర జ్ఞానం ఉన్న రైతులు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని భూమికి రికార్డులు తయారు చేయించుకున్నారు. నిరాక్షరాస్యులకు సాగు తప్ప రికార్డులు లేవు.

తాండవ నీటి రాకతో భూములకు గిరాకీ

తుప్పలు డొంకలతో అటవీ ప్రాంతాన్ని తలపించేలా ఉండే ఈ భూముల మధ్యలోంచి తాండవ రిజర్వాయరు కాలువ ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టు నీరు ఖరీఫ్ సీజన్‌లో భూములకు పుష్కలంగా ప్రవహిస్తుంది. అలాగే ఈ భూములకు రోడ్డు సౌకర్యం కల్పించడంతో ఒక్కసారిగా భూములకు ఊహించని గిరాకీ పెరిగింది. దీంతో ఆయా భూములపై కొందరు బడాబాబులు కన్నేశారు.

తప్పుడు రికార్డులతో రిజిస్ట్రేషన్లు

ఆన్‌లైన్ వ్యవస్థ రాకముందు పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన బడా బాబులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రైతుల ప్రమేయం లేకుండా కొన్ని భూములకు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కానీ ఈ భూములు ఎక్కడ ఉన్నాయో వారికి నేటికీ తెలియదు. 2016లో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అధికారుల అండతో ఈ భూమిలోకి వచ్చేందుకు ప్రయత్నించగా రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా ఏకమై అడ్డుకున్నారు. రైతుల ఆగ్రహాన్ని చూసిన బడా బాబులు, అధికారులు సైతం పరుగులు తీసారు. అప్పట్లో రైతులు విజయవాడలో ఆందోళన చేయడంతో అప్పటి కలెక్టరు ఈ భూములను రిజిస్ట్రేషన్లు చేయకుండా ఎలాంటి లావాదేవీలు జరగకుండా నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు తెలియకుండా ఆన్‌లైన్‌లో ఉన్న సాగు హక్కును తొలగించడంతో రైతులు భగ్గుమంటున్నారు.

రీసర్వే జరిగి ఉంటే బాగుండేది



గత ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న రీసర్వేతో ఏళ్ల తరబడి వెంటాడే సమస్యకు మోక్షం లభిస్తుందని ఆశించాం. మా పంచాయతీలో భూములు త్వరలో రీ సర్వే చేస్తామని అధికారులు షెడ్యూలు విడుదల చేశారు. ఈలోపు ఎన్నికలు జరగడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రీసర్వే అపేసారు.

రెడ్డి సత్యనారాయణ, సాగుదారు

ఆందోళన చేసి అడ్డుకున్నాం..



నేను పుట్టకముందు నుంచి మా తల్లిదండ్రులు ఈ భూమిలో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. సాగులో నేటికీ మేము ఉన్నాం. 2016లో రెవెన్యూ అధికారులు బడా బాబులతో చేతులు కలిపి మాకు అన్యాయం చేసేందుకు కుట్ర పన్నారు. అప్పట్లో విజయవాడలో రైతులంతా ఆందోళన చేస్తే ఏపీ పురం రెవెన్యూ గ్రామంలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయరాదని ఆన్‌లైన్ సర్వే నంబర్లు అప్పటి కలెక్టరు రెడ్ మార్కులో పెట్టేశారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి సమస్య లేదు. ఇటీవల మా భూముల సాగు హక్కులో మాపేర్లు లేకుండా చేసేశారు.

మహేష్, భూమి సాగుదారు

క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలి



రెవెన్యూ సదస్సులో ఈభూములు సాగుపై రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామసభలు అనంతరం సర్వేయరుతో కలిసి రైతులు సాగు చేసే ఏపీపురం పంచాయతీలో భూములను స్వయంగా పరిశీలిస్తాను. రైతులు చెప్పిన విషయాలు రికార్డులో ఉన్న దానిని పరిశీలించి నిబంధనల ప్రకారం న్యాయం చేస్తాను. నా స్థాయిలో జరగకపోతే కలెక్టరు, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్తాను. ఈ భూముల వ్యవహారంలో బడా బాబులు బోకర్ల ప్రమేయం ఉన్నట్టుగా అనుమానం ఉంది.

ఎ.వేణుగోపాల్, తహసీల్దార్ నాతవరం మండలం

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

మాడుగుల రూరల్: వచ్చే నెల 5 వ తేదీన గన్నవరంలో జరిగే హైందవ శంఖారావ సభను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి ఆయన కె.జె.పురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. హిందూ ఐక్యతను చాటి చెప్పేందుకు ప్రతి హిందువు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలి రావాలని కరపత్రాలు అందజేసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ వీహెచ్‌పీ అధ్యక్షుడు జగన్నాథరావు, కార్యదర్శి బి. జగ్గారావు, సంయుక్త కార్యదర్శి పరిమి కాసుల జగ్గారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలి



నకారా చిత్ర పటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న మున్సిపల్ కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం : సైబర్ నేరాల పట్ల పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాఘరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పెన్షనర్స్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బ్యాంకుకు విచ్చేసే పెన్షనర్లకు సత్వర సేవలు అందించేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ పురపాలక సంఘ కార్యాలయం ద్వారా పెన్షనర్లకు సత్వర సేవలు అందిస్తామన్నారు. ఎస్టీవో గణేష్ మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ విధిగా లైఫ్ సర్టిఫికెట్లు కార్యాలయంలో అందించాలన్నారు. నకారా అనే ఉద్యోగి చేసిన న్యాయపోరాటం ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లభించిందని సంఘం అధ్యక్షులు గజ్జెలమ్మ అన్నారు. పెన్షన్ అనేది ప్రభుత్వ ఉద్యోగుల హక్కు అన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



లచ్చన్నపాలెంలో మేలుకొలుపులు

మాకవరపాలెం: మేలు కొలుపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. మండలంలోని లచ్చన్నపాలెంలో ఏటా ధనుర్మాసం ప్రారంభం నుంచి భోగి వరకు నిత్యం మేలు కొలుపు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున గ్రామస్థులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మేలుకొలుపు చేపట్టారు.

మాడుగుల : మాడుగులలో మంగళవారం నుంచి మేలుకొలుపులు ప్రారంభించారు. వేంకటేశ్వరాలయం, పార్థసారథి ఆలయం, సీతారామస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఈ నెల 16న నెలగంట మోగడంతో రొంగలినాయుడు పాలెంలో గ్రామస్తులు మేల్కొలుపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. భోగి పండగ వరకూ ప్రతి రోజూ ఉదయం 4 నుంచి రామాలయం నుంచి రాముని చిత్రపటంతో మేల్కొలుపు కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో సర్పంచ్ పైడితల్లమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట : సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా వైష్ణవ పారాయణం కోసం రథాన్ని తయారు చేశారు. మంగళవారం వేకువ జామున కమిటీవారు రథానికి గోదాదేవి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో భజనలు చేస్తూ భక్తి పారాయణం చేశారు.

ఇసుక తవ్వకాలపై విచారణ



జంగాలపల్లిలో విచారణ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై మైన్స్ అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని జంగాపల్లి వద్ద సర్పానది సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జంగాలపల్లికి చెందిన అల్లు రామునాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గనులశాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ రమణ, ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఇసుక తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తవ్వకాలకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని జియాలజిస్ట్ రమణ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సూర్యనారాయణ ఉన్నారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు

నర్సీపట్నం: ఈ నెల 21న నర్సీపట్నంలో జరుగుతున్న సీపీఎం జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులతో కలిసి మహాసభల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలు 22వ తేదీ వరకు జరుగుతాయన్నారు. రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు విరమించుకోవాలని, మైదాన గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రుత్త శంకరరావు, అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు



మాకవరపాలెంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రామారావు

మాకవరపాలెం: పింఛనుదారులంతా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని మండల పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు కోసూరు రామారావు అన్నారు. తామరంలో మంగళవారం పింఛనుదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛనుదారులకు ఇవ్వాల్సిన డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమష్టిగా ఉన్న నాడే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. నర్సీపట్నం ట్రెజరీ అధికారులు పాల్గొని పింఛనుదారుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం సీనియర్ పింఛనుదారులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రంగరాజు, ట్రెజరర్ ముత్యాలరాజు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం



అధ్యక్షుడు మాణిక్యాలరావు



మండల కార్యదర్శి యశ్వంత

నాతవరం: వీఆర్వోల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా పి.మాణిక్యాలరావు కార్యదర్శిగా సబ్బవరపు యశ్వంతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టుగా జిల్లా వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షుడు బాబు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశామని ఎన్నికలు లేకుండా అందరు ఏకాభ్రాయంతోనే కమిటీని ఏర్పాటు చేశామన్నారు. చెర్లోపాలెం వీఆర్వోగా పని చేస్తున్న మాణిక్యాలరావును అధ్యక్షుడిగా శృంగవరం వీఆర్వోగా పని చేస్తున్న యశ్వంతను కార్యదర్శిగా మరికొంతమంది వీఆర్వోలను మండల కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు బాబు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలు

బుచ్చెయ్యపేట: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కీలక పాత్ర వహించాలని స్థానిక ఎంపీడీఓ కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల కనీస అవసరాలు తీరుస్తూ భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని వనరుల సద్వినియోగం సాధించడమే సుస్థిర అభివృద్ధి లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

చీడికాడ : రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆ కేంద్రాలకు రైతులు నేరుగా ధాన్యం విక్రయించాలని స్థానిక మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఖండివరం, ఎల్.బి.పట్నం, గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో చీడికాడ, దిబ్బపాలెం, క్లస్టర్లుగా ఏర్పాటు చేసి, ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రారంభించామన్నారు. క్వింటాలు సాధారణ రకం రూ.2300, గ్రేడ్ ఎ రకానికి రూ.2,320 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలు నుంచి 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాలో నగదు జమా చేస్తామని ఏవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, రైతుసేవా సిబ్బంది పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో సెమీ క్రిస్మస్ వేడుక



సెమీ క్రిస్మస్ వేడుకల్లో బిషప్ మోజెస్

కె.కోటపాడు : యేసుప్రభు దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలని బిషప్ ఎస్.మోజేష్ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో గల హోలీ లైవ్ క్రీస్తు చర్చ్ పాస్టర్ బిషప్ ఎస్.మోజేష్ ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి పలు చర్చ్‌లకు చెందిన పాస్టర్, పాస్టరమ్మలు హాజరయ్యారు. మోజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యేసు బోధనలను ఆచరించడంతో పాటు సేవా మార్గంలో కొనసాగాలన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్‌తో పాటు కేండిల్ ప్రదర్శన జరిపారు. పాస్టర్లు ప్రేమ్‌కుమార్ మహంతి, సాల్మన్‌రాజ్, దేవ ప్రసాద్, వి.సంతపాలెం సర్పంచ్ దేవీలత, దేముడునాయుడు, వైస్ ఎంపీపీ నాగ విజయలక్ష్మి, గోపి పాల్గొన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

నర్సీపట్నం: పట్టణంలో ఎన్‌జీవో హోమ్‌లో పెద్దబొడ్డేపల్లి బేతేస్త ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మంగళవారం యూత్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రీస్తు మార్గంలో నడవడం ద్వారా యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుస్తారని ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ జె.ప్రేమ్‌కుమార్ అన్నారు.

మోదమ్మకు ఆభరణాలు



ఆభరణాలు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన జాజిమొగ్గల వరహమూర్తి, లక్ష్మి, దంపతులు వారి కుమారులు శివ, హేమ దంపతులు, వాసు, శ్రీదేవి దంపతులు, నవీన్ చక్రవర్తి ఆర్థిక సహకారంతో ఆభరణాలు మంగళవారం అందజేసారు. అమ్మవారికి ఒక తులం బంగారం, 8 తులాలు వెండి హారం, రూ.5వేల నగదును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు.

భూ వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

నాతవరం: కోర్టు తగాదాలు లేకుండా రికార్డులు ప్రకారం సాగు చేసుకునే భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి యుద్ధప్రతిపాధికన పరిష్కరిస్తానని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో మంగళవారం వి.బి. అగ్రహారం వై.బి. అగ్రహారం పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెండు పంచాయతీల్లో గత ప్రభుత్వంలో జగనన్న భూ రీసర్వే చేయడంతో రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ అన్నారు. వి.బి.అగ్రహారంలో ఒకే సమస్యపై ఫిర్యాదు వచ్చిందన్నారు. అది కూడా ఇద్దరు అన్నదమ్ముల నడుమ 5ఏళ్లుగా భూ వివాదం జరుగుతుందన్నారు. తహసీల్దార్ పంట భూమిలోకి వెళ్లి రికార్డులు సాగు ప్రకారం స్వయంగా సర్వే చేయించారు. అందులో తమ్ముడు కంటే అన్నయ్యకు కేవలం ఒక సెంటు మాత్రంగా అధికంగా ఉందన్నారు. తర్వాత ఇంటి వద్ద నివాసం స్థలం సర్వే చేయగా నాలుగు సెంట్లు వ్యత్యాసం ఉందన్నారు. పూర్వార్జితం ఆస్తి కావడంతో గ్రామ పెద్దల సమక్షంలో ఇరువురు రాజీ చేసుకుని సమస్య పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్, వీఆర్వోలు మాకిరెడ్డి చలపతి శేషు, విశ్రాంత వీఆర్వో భాస్కరరావు పాల్గొన్నారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

దేవరాపల్లి: సహజ వనరులకు సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేయాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిర అభివృద్ధిపై రెండో రోజు మంగళవారం పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ సహజ వనరులను దుర్వినియోగం చేయకుండా భావితరాలకు అందించేందుకు పరిరక్షించాలన్నారు. ఎంపీడీవో సువర్ణరాజు మాట్లాడుతూ పర్యావరణ, సామాజిక, ఆర్థిక సుస్థిరత సాధించే దిశగా అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో లక్ష్మీనారాయణ, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, సిహెచ్‌వో పి.ప్రసాదరావు, ఎల్కక్టికల్ ఏఈ శంకరరావు, రైవాడ పంచాయతీ కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన

మాకవరపాలెం : ఇంధన పొదుపుపై తామరంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విద్యుత్‌శాఖ నర్సీపట్నం డీఈ రామకృష్ణారావు ఇంధన పొదుపు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ వినియోగం వల్ల ఇందన పొదుపు అవసరమన్నారు.

చైల్డ్ ఆధార్ నమోదు

కె.కోటపాడు : చైల్డ్ ఆధార్ నమోదు కార్యక్రమాలను గ్రామాల్లో సచివాలయాల వేదిక ద్వారా నిర్వహించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. చౌడువాడ గ్రామంలో గల సచివాలయంలో మంగళవారం నిర్వహించిన చైల్డ్ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు ఈ ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా వివరాలను అందించి ఆధార్ కార్డును పొందాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ

కె.కోటపాడు : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల సర్వేయర్ రామచంద్రమూర్తి అన్నారు. సూరాైడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యల పరిష్కారానికి అందించిన అర్జీలను ఆయన స్వీకరించారు. సర్పంచ్ రొంగలి రాము, వీఆర్వో గౌరీశంకర్ పాల్గొన్నారు.

తాగునీరు, రహదారులకు నిధుల కేటాయింపు

చోడవరం : ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ బడ్జెట్ సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2025-26 సంవత్సరానికిగాను ఆదాయ, వ్యయాలు, చేపట్టవలసిన పనులపై ఈ సమావేశంలో ఎంపీటీసీలంతా ప్రతిపాదించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.90లక్షలు, మండల పరిషత్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టబోయే పనులను ఆమోదించారు.

పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

దేవరాపల్లి : అటవీ పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని చింతలపూడి సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ కోరారు. చింతలపూడి పంచాయితీ సమ్మెదలో మంగళవారం రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఇతర భూ సంబంధిత సమస్యలను తహసీల్దార్ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. అనంతరం రెవెన్యూ పరమైన సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ వార్డు మెంబర్ దొమ్మంగి సన్యాసమ్మ పాల్గొన్నారు.

అన్నదాత ఆందోళన

గొలుగొండ: తుపాను ప్రభావం వరి రైతులను కలవరపరుస్తుంది. కోతకు సిద్ధంగా ఉన్న వరి, కొంతమేర కోసిన వరి తుఫాన్ ప్రభావం ఎక్కువైతే నష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మండలంలో రెండు వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. అయితే విప్పలపాలెం, దారపాలెం ప్రాంతాల్లో కోతకు సిబ్బంది మరో 1500 ఎకరాల్లో పండి ఉంది. రావణాపల్లి జలాశయం దిగువన మరో 500 ఎకరాల వరకు వరికోతలు జరిగాయి. వాటిని కుప్పలు పెట్టే పనుల్లో రైతులు ఉన్నారు.

కె.కోటపాడు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా వర్షాలు పడనున్నట్టు వాతావరణశాఖ సూచనలను జారీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. రెండు గ్రామాల్లో రైతులు వరికోతలు పూర్తయిన పంటను కల్లాలకు తరలించడంతో పాటు కుప్పలుగా పెట్టుకోవాలని సూచించారు.